క్లుప్తంగా

22 సీసీ కెమెరాలు ఏర్పాటు



మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి గ్రామంలో దాతల సహకారంతో ప్రధాన కూడలిలో ఒకే రోజు 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు తెలిపారు. గ్రామంలో ముఖ్యమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణతో కలసి గురువారం ఆయన పరిశీలించారు. త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీలచే సీసీ కెమెరాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీఆర్వో వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, పీఏసీఎస్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, సునీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

467 మందికి వైద్య పరీక్షలు

కోనేరుసెంటర్: మండలంలోని రుద్రవరం గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు గురువారం చిన్నాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 467 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 36 మందికి స్వల్పపాటి అస్వస్థతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ లాస్యహరిత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. డాక్టర్ గాయత్రి సాయి హరిప్రియ, ఎంపీహెచ్‌ఈఓ పీవీ పరమేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ పీ అమ్మాజీ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక



చల్లపల్లి: స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు టెక్ మహీంద్రాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్ గురువారం తెలిపారు. గత నెల 23వ తేదీన హైదరాబాదులో నిర్వహించిన ఇంటర్వ్యూలకు కళాశాల నుంచి 14 మంది విద్యార్థినులు హాజరుకాగా వారిలో తోట జయశ్రీ, కొడాలి రేణుశ్రీ, కోట సుచిత్రలు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, కంప్యూటర్ హెడ్ పి.శంకరరావు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: మండలంలోని మందపాకల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ గోపిచంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతకోళ్ల ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడేపల్లి పంచాయతీరాజ్ కాలనీ, రామ్‌నగర్, పోస్టల్ కాలనీ, నారాయణపురం, టెంపుల్ కాలనీ, పంబలగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మన ఆరోగ్యం మన బాధ్యత



కృత్తివెన్ను: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని ప్రతి ఒక్కరూ ప్రణాళికా బద్ధంగా దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని కృత్తివెన్ను పీహెచ్‌సీ వైద్యుడు సాయిసందీప్ పేర్కొన్నారు. కృత్తివెన్ను, నిడమర్రు పంచాయతీల్లో గురువారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కృత్తివెన్నులో ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంపై సరైన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ ఝాన్సీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

చల్లపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని మొవ్వ ఐసీడీఎస్ అధికారి ప్రసన్న విశ్వనాథ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం సచివాలయం-3లో సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా గురువారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికలు చదువుకునేందుకు అవకాశాలు కల్పించాలని సూచించారు.సూపర్‌వైజర్స్ ఆదిలక్ష్మి, విశ్రాంతమ్మ, సచివాలయ సిబ్బంది కిరణ్మయి, షకీరా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో వేంచేసియున్న శ్రీకాకుళేశ్వరస్వామి దేవస్థానంలో నవమ వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం విశ్వక్సేన పూజ, అగ్ని మధనము, విశ్వశాంతికై నవగ్రహ యజ్ఞం, పంచవింశతి కుంభాసాధన, ఇతర పూజలు జరిగాయి.

ఆలయ ఆదాయానికి శఠగోపం

- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
- నోటీసులు తీసుకోని వైనం
- మీనమేషాలు లెక్కిస్తున్న దేవదాయశాఖ అధికారులు

అద్దె చెల్లించరు.. ఖాళీ చేయరు..!



నోటీసులు తీసుకోని యజమానుల దుకాణాలు ఇవే

మచిలీపట్నంటౌన్: నగరంలోని శ్రీరంగనాయక స్వామి దేవస్థానానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలను అద్దెకు తీసుకున్న వ్యాపారులు అద్దెలు సకాలంలో చెల్లించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే వాదనలు బలంగా వినవస్తున్నాయి. ఈ దుకాణాలను వేలంలో దక్కించుకున్న గుత్తేదారులు లక్షలాది రూపాయలను గుడ్‌విల్‌గా తీసుకుని వేరే వ్యక్తులకు సబ్ లీజ్‌కు ఇస్తున్నారు. ఈ దుకాణాల్లో అసలు వ్యాపారుల కన్నా సబ్ లీజుదారులే వ్యాపారాలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యం.

ఏళ్ల తరబడి బకాయిలు

తక్కువ అద్దెకు తీసుకుని సబ్ లీజుదారుల వద్ద గుత్తేదారులు అధిక మొత్తంలో నెలవారి అద్దెలు వసూలు చేస్తున్నారు. కానీ నామమాత్రంగా ఉన్న అద్దెను సైతం సంబంధిత గుత్తేదారులు నెలలు, సంవత్సరాల తరబడి చెల్లించకుండా బకాయి పడుతున్నారు. ఆలయ నిర్వాహక అధికారులు గత కొన్ని ఏళ్లుగా గుత్తేదారుల వద్ద లక్షలాది రూపాయలు లంచంగా దండుకుంటూ పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందువల్లే ఈ దుకాణాలను గుత్తేదారులు సబ్ లీజులకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆలయ పరిధిలో మొత్తం 64 షాపులు ఉండగా 11 ఏళ్ల లీజుకు 20 షాపులు, మూడేళ్ల లీజుకు 35 షాపులు కొనసాగుతున్నాయి. మిగిలిన 9 షాపులు కోర్టు వివాదాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధాన రహదారిలో ఉన్న షాపుల అద్దెలు నెలకు రూ. 15 వేల నుంచి రూ. 35 వేల వరకూ ఉన్నాయి. ఈ దుకాణాల్లో ఎక్కువగా సబ్ లీజుదారులే కొనసాగుతుండటం గమనార్హం.

ఎప్పుడు ఖాళీ చేయిస్తారో..

హైకోర్టు ఆదేశాల ప్రకారం దుకాణాలను ఖాళీ చేయాలని ఆలయ అధికారులు సంబంధిత ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నా వారు తీసుకోవడం లేదని తెలుస్తోంది. రిజిస్టర్ పోస్టులో నోటీసులు పంపిన తీసుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ జీవో నెంబర్. 30ని అమలు చేసి ఈ దుకాణాలను త్వరితగతిన ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటికీ ఫలితం లేదు. ఆ ప్రాంతంలోని మూడు దుకాణాలను మరి దేవదాయశాఖ అధికారులు ఎప్పుడు ఖాళీ చేయిస్తారో.. వేచి చూడాల్సిందే.

అన్యమతస్తుల ఆక్రమణలో షాపులు

నగరపాలక సంస్థ కార్యాలయం పక్కనున్న సందు ప్రారంభంలో ఉన్న మూడు దుకాణాలను మల్లెల డేవిడ్, మొహమ్మద్ అలీ, షేక్ గుల్జార్ గత 20 ఏళ్లుగా అక్రమంగా స్వాధీన పర్చుకున్నారు. ఈ దుకాణాలను సబ్‌లీజులకు ఇచ్చారు. ఈ దుకాణాలకు సంబంధించి అప్పటి నుంచి ఇప్పటి వరకు వారు ఆలయానికి ఎలాంటి రుసుము చెల్లించడం లేదు. దీంతో ఈ దుకాణాలకు అద్దె చెల్లించాలని అధికారులు పలు మార్లు అడుగుతున్నా వారి నుంచి చలనం లేదు. దీంతో ఆలయ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆక్రమణదారులకు వ్యతిరేకంగా ఇటీవల తీర్పును ఇచ్చింది. దుకాణాలను అక్రమంగా వినియోగించుకుంటున్న వారు ముగ్గురూ ఆలయానికి దాదాపు రూ. 65 వేలను అపరాధ రుసుంగా చెల్లించి, దుకాణాలను ఖాళీ చేయించాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

చర్యలు తీసుకుంటాం

హైకోర్టు ఆదేశాల ప్రకారం ఆలయానికి చెందిన మూడు దుకాణాలను రానున్న నెల రోజుల్లో ఖాళీ చేయిస్తాం. నోటీసులు పంపితే ఒక గుత్తేదారుడు తప్ప మిగిలిన ఇద్దరూ తీసుకోలేదు. వారికి కూడా నోటీసులు అందించి చర్యలు తీసుకుంటాం. కోర్టు ఆదేశాలను అమలు చేస్తాం.

–సత్య ప్రసాదు, ఆలయ ఈఓ

గూడూరు పీఏసీఎస్‌లో కలెక్టర్ తనిఖీ



గూడూరు పీఏసీఎస్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గూడూరు: గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని గురువారం జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సొసైటీలో యూరియా నిల్వలపై అధికారులను ఆరా తీశారు. యూరియా వివరాలను వ్యవసాయ శాఖ అధికారి జి.శివరామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులు యూరియా కొరతతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, సరిపడా యూరియా సరఫరా చేయించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. పంటకు ఇప్పటి వరకు రెండు డోసుల యూరియా మాత్రమే వచ్చిందని, 3వ డోసు కొట్టడానికి ఎక్కడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిమాండ్‌కు తగ్గ యూరియా అందుబాటులో ఉందని రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైనంత యూరియా తప్పకుండా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఎస్.పద్మావతి, డీఎం మురళీకిషోర్, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి, ఏఓ జి.శివరామకృష్ణ, డీసీ చైర్మన్ పోతన స్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ కె.రాంజీ



గూడూరులో ఉపాధ్యాయులకు సత్కారం

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య కె.రాంజీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆచరణీయమని అన్నారు. దేశానికి రాష్ట్రపతిగా పని చేసినా ప్రజలకు తాను ఒక ఉపాధ్యాయునిగానే గుర్తుండాలి అని ఆయన అనేక ప్రసంగాల్లో చెప్పుకునేవారని గుర్తుచేశారు. అనంతరం సీఎస్ఈ, ఈసీఈ, సైన్స్, హ్యూమానిటీస్ నుంచి ముగ్గురు అధ్యాపకులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సత్కరించారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రెక్టర్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ విజయ్‌కుమారి, కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, ఎం.బాబురెడ్డి, ఆర్ కిరణ్‌కుమార్, డీ రామశేఖర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు: మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గూడూరు జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్‌లో పాఠశాలకు జిల్లా స్థాయి ఎక్సెలెన్స్ అవార్డు రావడానికి కృషి చేసిన పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్‌తోపాటు సీనియర్ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయని గొరిపర్తి విజయకుమారి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. పాఠశాల డైరెక్టరు సాబూజాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓలు డాక్టరు ముబీన్‌భాను, వెంకటేశ్వరరావులను సత్కరించారు.

యూరియా సమస్యను పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు, రైతులు

ఘంటసాల: యూరియా సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు స్థానిక నేతలు, రైతులతో కలిసి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల మండలంలో వరి పంట వేసిన రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ప్రైవేటు వ్యాపారుల వద్ద యూరియా లేకపోవడంతో వచ్చే అరకొర యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాక్షిలో యూరియాపై కట్టడి ముట్టడి కథనంలో ఘంటసాల మండలం లంకపల్లి పీఏసీఎస్ వద్ద క్యూలో నిలుచున్న ఫొటో ఫేక్ కాదని, రైతుల వ్యధని తెలిపారు. కావున రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని పీఏసీఏస్‌ల వద్ద యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు కుంపటి నాగేంద్రబాబు, మాడెం నాగరాజు, పీఏసీఏస్‌ల మాజీ చైర్మన్‌లు తాతినేని కృష్ణారావు, వేమూరి రత్నశేఖర్, పరుచూరి రామకృష్ణ, గల్లా గిరీష్, నేతలు వేమూరి ప్రవీణ్, దిరిశం పిచ్చేశ్వరరావు, గొర్రెపాటి గోపాలకృష్ణ, చిట్టూరి రమేష్, చికినం బాలాజీ, అంగడాల నాగరాజు, ముల్పూరి వెంకయ్య, దోనె వెంకటేశ్వరరావు, కొడాలి గంగాధరరావు, గొర్రెపాటి మధుసూధనరావు, కొల్లూరి శ్రీను, వీర్ల రాంబాబు, రైతులు పాల్గొన్నారు.



అడపావారిపాలెంలో సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం పడిగాపులు

అడపావారిపాలెం(మోపిదేవి): తెల్లవారిజాము నుంచే పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అడపావారిపాలెం సొసైటీ కేంద్రం వద్ద గురువారం యూరియా పంపిణీ చేశారు. ఎన్ని ఎకరాలు ఉన్నా ఒక కట్ట వరకే ఇవ్వడంతో రైతులు అధికారులను నిలదీశారు.

14మంది ఎస్టీలకు నివాస ధ్రువీకరణ పత్రాలు

మర్రిపాలెం(నాగాయలంక): మండలంలోని మర్రిపాలెం సచివాలయం పరిధిలోని 14మంది ఎస్టీ (యానాదులు)లకు ఆధార్ కార్డులు పొందు నిమిత్తం స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో నివాస ధ్రువీకరణ (డొమిసిలిన్) పత్రాలు అందించారు. వీరు చాలా కాలంగా ఆధార్ కార్డులు పొందే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్న తీరును తహసీల్దార్ గుర్తించి ఈ పత్రాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రావూరి వెంకటేశ్వరమ్మ, ఉపసర్పంచి బండ్రెడ్డి కృష్ణకుమారి, మాజీ సర్పంచి బండ్రెడ్డి వెంకట గోపాలరావు(బోస్) యానాదుల సంఘం రాష్ట్ర నాయకుడు నక్కా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు అవ్వడంతో అభివృద్ధి కార్యక్రమాలకు వేగవంతం అయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం ఆయన మచిలీపట్నం పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నానికి స్వదేశీ దర్శన్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ. 11 కోట్లు మంజూరు చేసిందని త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో వ్యక్తిపై దాడి

పెడన: మండలంలోని నందిగామ గ్రామంలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం ఊరేగింపులో ఒక వ్యక్తిపై దాడి జరిగిన సంఘటనపై పెడన పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఊరేగింపులో గుర్తుతెలియని వ్యక్తి వైట్ కిరోసిన్ బాటిల్‌ను విసరగా అది పక్కన నిలబడి గణపతి విగ్రహాన్ని చూస్తున్న బొర్రా నాగబాబు ముఖంపై పడింది. అందులోని వైట్ కిరోసిన్ నాగబాబు కళ్లలోకి వెళ్లడంతో అతడిని హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్యకర్తలకు పరామర్శ



వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) గురువారం బందరు మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను పరామర్శించారు. తొలుత నార్త్ మండలంలోని తాళ్లపాలెంలో అనారోగ్యంతో మృతిచెందిన కోమట్ల వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్త మోపిదేవి నాంచారయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే శ్రీకాకుళపు నాగేశ్వరరావు తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా వారి ఇంటికి వెళ్లి ఆమెను పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ కార్యకర్త బుగ్గల బాలాజీ ఓణీల కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని 41వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సింగనపూడి నాగరాజు ప్రమాదవశాస్తూ గాయపడి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పేర్ని నాని, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) నాగరాజును గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ కౌన్సిలర్ చిటికెన నాగేశ్వరరావు, కేసిన నాని తదితరులు ఉన్నారు.

మోపిదేవిలో..



మోపిదేవిలో శేషు భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు నివాళి

మోపిదేవి: మోపిదేవికి చెందిన మల్లవోలు శేషు(29) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం మోపిదేవిలోని వారి ఇంటివద్ద శేషు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ఎంపీటీసీ కారుమూరి శివనాగరాజు, నాయకులు బండారు సూరిబాబు, కొండేటి వాసు, ఆది రాంబాబు, మత్తి వెంకట సత్యనారాయణ, రవికాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు ఎంపిక



ఉదయకుమార్



సుజాత




నాగార్జున

నాగాయలంక: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు కొమ్మినేని ఉదయ కుమార్(బయాలజీ) రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దక్కించుకోగా, స్కూలు అసిస్టెంట్(ఇంగ్లీష్)గా పని చేస్తున్న అరవ సుజాత జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉదయకుమార్‌కు ఇటీవల సౌత్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. సుజాత రెండు పర్యాయాలు మోపిదేవి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, నేషనల్ బిల్డర్ అవార్డు, విన్నర్ వీల్స్ క్లబ్ నుంచి హ్యాపీ స్కూలు అవార్డు, పలు సన్మానాలు పొందారు. ఎంఈఓలు సనకా శ్రీకాంత్, అన్నపరెడ్డి రామారావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామారుతి, హెచ్ఎం అలపర్తి సత్యనారాయణ తదితరులు అవార్డు గ్రహీతలను అభినందించారు.

కోడూరు: మండలంలోని స్వతంత్రపురం మోడల్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కారాని నాగార్జున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నాగార్జున జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి, డీఈఓ చేతుల మీదగా ఈ అవార్డును అందుకోనున్నారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జగణపయ్యా..!



నిమజ్జన గ్రామోత్సవంలో జానకీరామపురం గణపయ్య

పెడన: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు గురువారంతో తొమ్మిదో రోజుకు చేరాయి. పలు మండపాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి వినాయకుని ప్రతిమలను భారీ ఊరేగింపులతో, వాయిద్య మేళాలతో నిమజ్జనానికి తరలించారు.


గణనాథుని నిమజ్జనం

మెరకనపల్లి(మోపిదేవి): మెరకనపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన గణనాథుని విగ్రహాన్ని గురువారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో గ్రామంలో ఊరేగించి సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి, బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ వీధి, జానకీరామపురం గ్రామాల్లోని గణపతి విగ్రహాలను గురువారం వైభవంగా నిమజ్జనం చేశారు. పెదతుమ్మిడి గ్రామంలోని విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మట్టా నాగబాబు కొబ్బరికాయ కొట్టి గ్రామోత్సవం ప్రారంభించారు. బంటుమిల్లి ఆంధ్రబ్యాంకు సెంటర్లోని విగ్రహం వద్ద శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఘంటసాల(ఘంటసాల): ఘంటసాల గ్రామంలో నిర్వహిస్తున్న వినాయక మండపంలోని లడ్డూను గ్రామానికి చెందిన వెంకటరామయ్య రూ.27 వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం గణపతిని నిమజ్జనం చేశారు.

వివాదాస్పద దారిని పరిశీలించిన ఆర్డీఓ



బంటుమిల్లి: మండలంలోని పెదపాండ్రాక - నారాయణపురం గ్రామాల మధ్య ఉన్న వివాదస్పద దారి సమస్యను బందరు ఆర్డీఓ స్వాతి గురువారం పరిశీలించారు. వివరాల్లోకి వెళితే.. పెదపాండ్రాక రెవెన్యూ పరిధిలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన భూస్వామి అనుమతులు లేకుండా చెరువు తవ్వారు. దీని కోసం నారాయణపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న అసైన్ భూములో నుంచి రాకపోకలు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ దారిలో ఎగువ ప్రాంతంలోని రైతులు నడవకుండా గోడౌన్, బోర్లు వేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నాడు. దీనిపై రైతులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరు బాలాజీ ఆదేశాల మేరకు ఆర్డీఓ దారిని పరిశీలించారు. ఈజ్‌మెంటు హక్కుల మేరకు రైతులందరికి నడిచే హక్కులు ఉన్నాయని ఆర్డీఓ స్వాతి పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, ఆర్ఐ శంకర్, సర్వేయరు దాసు, రైతులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్‌పై దాడి



నాగాయలంక: స్థానిక గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కైతేపల్లి వెంకటేష్‌పై దాడి జరిగిన గురువారం చోటుచేసుకుంది. నాగాయలంక ఎస్ఐ కలిదిండి రాజేష్ కథనం ప్రకారం కైతేపల్లి వెంకటేష్ తన గ్రామంలో వడ్డీలకు డబ్బు ఇచ్చే తోట శ్రీనివాసరావు నుంచి నెలకు ఐదు రూపాయల వడ్డీకి రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తున్నాడు. రెండు నెలల్లోపు మొత్తాన్ని తిరిగి చెల్లించాలని శ్రీనివాసరావు కోరగా వెంకటేష్ నిరాకరించాడు. మధ్యవర్తిగా ఉన్న మండవ బాలవర్ధిరావు(టీడీపీ నాయకుడు) గురువారం తన కార్యాలయానికి పిలిపించాడు. అతను సదరు కార్యాలయానికి వెళ్లగా శ్రీనివాసరావు, ఆయన ముగ్గురు కుమారులు రామాంజనేయులు, శివాజీ, గణేష్, బాలవర్ధి వెంకటేష్‌పై దాడి చేశాడు. బాధితుడిని అతని సోదరుడు, తండ్రి రక్షించి అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

● ఈ-క్రాఫ్ నమోదు పరిశీలన

కృత్తివెన్ను: రైతులు తమ ధాన్యం విక్రయించుకోవాలంటే తప్పనిసరిగా ఈ-క్రాఫ్ నమోదు చేసుకోవాలని ఏఓ మాధురీ కిరణ్ పేర్కొన్నారు. గురువారం సీతనపల్లి గ్రామంలో జరుగుతున్న ఈ-క్రాఫ్ నమోదును ఏఓ పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో 2,000 ఎకరాలకు ఈ-క్రాఫ్ నమోదు చేశామని తెలిపారు.